

## రేపు తపాలా అదాలత్

**ప్రజాశక్తి - శ్రీకాకుళం**

తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈనెల 30వ తేదీన ఉదయం 11 గంటలకు 108వ తపాలా అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం సహాయ సంచాలకులు డబ్ల్యు.నాగాదిత్య కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సర్వీసులకు చెందిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు ఈ అదాలత్‌లో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ ఫిర్యాదులను ఈనెల 29వ తేదీ నాటికి 108వ తపాలా అదాలత్ అను శీర్షికతో డబ్ల్యు.నాగాదిత్య కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం 530 017 చిరునామాకు పంపాలని తెలిపారు.

# కిడ్నీ సమస్యపై ప్రభుత్వం ఉదాసీనం

- వీరగున్నమ్మ స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం పోరు
- ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణతో ప్రజలపై భారం
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు
- మందసలో కార్మిక చైతన్య బస్సు యాత్ర ప్రారంభం

**ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస**

కిడ్నీ సమస్య పరిష్కారంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు విమర్శించారు. సిఐటియు రాష్ట్ర మహాసభల నేపథ్యంలో మందసలో కార్మిక చైతన్య బస్సు యాత్రను బుధవారం చేపట్టారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గోవిందరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. తొలుత వీరగున్నమ్మపురంలోని వీరనారి వీరగున్నమ్మ స్మారకానికి సిఐటియు నాయకులు నివాళ్లు అర్పించారు. మందస బస్టాండ్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో నర్సింగరావు ప్రసంగించారు. కిడ్నీ రోగులకు సరైన వైద్యం, మందులు అందించడం లేదని విమర్శించారు. బాధితులకు కనీసం రక్షిత మంచినీటిని అందించినా కొంత నయమయ్యే పరిస్థితి ఉన్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు కార్మికుల పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న చట్టాల స్థానంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మందస జమిందార్లకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన వీరనారి వీరగున్నమ్మ స్ఫూర్తితో కార్మిక హక్కుల పరిరక్షణకు పోరు సాగించాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజూ దేశభక్తి జపం చేసే బిజెపి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దక్షిణకొరియా కంపెనీ పోస్కోకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం స్కీమ్‌వర్కర్లకు కనీస వేతనం చెల్లించకుండా దోపిడి సాగిస్తోందని విమర్శించారు. కుటుంబం బతకడానికి కనీసం రూ.26 వేలు కనీస వేతనంగా ఉండాలని ప్రభుత్వమే నిర్ణయించి, దాన్ని అమలు చేయకుండా మోసం చేస్తున్నాయన్నారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా బిజెపి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం రైళ్లు, పోర్టులు, రక్షణ, విద్యుత్‌తో సహా అన్ని రంగాలను ప్రయివేటుపరం చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రయివేటీకరణ జరిగితే ఛార్జీలు పెరిగి ప్రజలపై భారాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర సంపదను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అదానీకి కట్టబెడుతోందని చెప్పారు. గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానీకి అప్పగించిందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉందన్నారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న గోవిందరావు

15 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించకపోవడంతో, కార్మికులు నెలకు రూ.600 కోట్లకు పైగా శ్రమ దోపిడీకి గురవుతున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గోవిందరావు తెలిపారు. కనీస వేతనాల బోర్డునూ ప్రభుత్వం నియమించలేదని విమర్శించారు. మందస రైస్‌మిల్లు కార్మికుల సమస్యలపై యజమానులు మొండిగా వ్యవహరిస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయకుండా యజమాన్యాలు దోపిడీ సాగిస్తున్నాయని విమర్శించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పోరాటాలు చేపడతామని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ అమ్మన్నాయుడు తెలిపారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుదర్శనం మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల సంఘం నాయకులు సింహాచలం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతుంటే వైసిపి, టిడిపిలు మోడీకి మద్దతు పలుకుతున్నాయని విమర్శించారు.

### మందసలో భారీ ర్యాలీ

కార్మిక చైతన్య బస్సు యాత్ర సందర్భంగా మందస హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి మహిళలు, పురుషులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎర్రజెండాలు చేతపట్టి ప్రదర్శనలో పాల్గొన్నారు. సిఐటియు జిందాబాద్, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం మందస నుంచి కాశీబుగ్గ బస్టాండ్‌కు చేరుకుని అక్కడ సభ నిర్వహించారు. అక్కడ నుంచి కోటబొమ్మాళి మండలం కొత్తపేట, శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద సభ నిర్వహించి తొలి రోజు యాత్ర ముగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.గణపతి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లు మహాలక్ష్మి, సిఐటియు నాయకులు ఆర్.దిలీప్ కుమార్, వై.కేశవరావు, టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మందసలో భారీ ప్రదర్శనగా వెళ్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ధాన్యం సేకరణకు

# గ్రామాల వారీగా షెడ్యూల్

- పథకాల అమల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా ముందుండాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ధాన్యం సేకరణకు సంబంధించి గ్రామాల వారీగా షెడ్యూల్‌ను ఖరారు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తహశీల్దార్లను ఆదేశించారు. ధాన్యం సేకరణ, రీ సర్వే, బిహెచ్‌పి పంపిణీ, మ్యుటేషన్లు, ఎన్‌పిఐ హౌస్‌సైట్స్, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, స్పందన తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నష్టం వాటిల్లకుండా మేలు చేకూరేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో సమస్యలు తలెత్తితే ఆర్‌డిఒలు వెళ్లి పరిశీలించాలన్నారు. సమస్యలు తలెత్తితే సంబంధిత ఎఫ్‌పిఒపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం సేకరణపై మండల వ్యవసాయ అధికారి, సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఎంతమంది రైతులు ఉన్నదీ గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. తడిగా ఉంటే ఆరబెట్టి తీసుకోవాలని చెప్పారు. విఆర్‌ఒలు ఉదయం ఎనిమిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు రైస్‌మిల్లులు వద్ద తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పథకాల అమల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా ముందుండాలని కలెక్టర్ తహశీల్దార్లకు సూచించారు. రీ సర్వేలో జిల్లా అగ్రగామిగా నిలిచిందన్నారు. వలసలు వెళ్లిన వారు సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చే అవకాశం ఉన్నందున ఇకెవైసి శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న బిహెచ్‌పిలు అన్ని మండలాల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్‌పై మండలాల వారీగా సమీక్షించి ఆయా మండలాల్లో గ్రానైట్ యాజమాన్యాలతో తహశీల్దార్లు సంప్రదించి, వచ్చిన స్టోన్స్ ప్లాంటేషన్ చేయాలని ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించిన జిటిపై ప్రతిరోజూ మండల సర్వేయర్, విఆర్‌ఒలతో తహశీల్దార్లు మాట్లాడాలని చెప్పారు. మ్యుటేషన్లను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పలు కారణాలతో జిల్లాలో 11 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు జారీ చేయలేదని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే పట్టాలు జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని తహశీల్దార్లను ఆదేశించారు. సచివాలయాల పరిధిలో ఎంతమందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలి, ప్రభుత్వ భూమి ఎంత ఉంది, ఎంత భూమి కావాల్సి ఉందో తెలుసుకోవాలన్నారు. కోర్టు కేసులపై తహశీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. స్వామిత్వకు సంబంధించి గ్రామకంఠం భూములను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్‌సిలకు శ్మశానవాటికల కోసం భూములను గుర్తించాలని ఆదేశించారు. అసైన్డ్ భూములు ఎంతమంది రైతులకు అవసరమో గుర్తించాలని జెసి నవీన్ ఆదేశించారు. సాగు చేసుకునేందుకు ప్రభుత్వ భూములను ఇచ్చేందుకు భూములను గుర్తించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, సర్వే శాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్, ఆర్‌డిఒ బి.శాంతి, సీతారామ్మూర్తి, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నిధుల వినియోగంలో నిర్లక్ష్యం ఎందుకు?

### విద్యుత్ శాఖ ఎస్ఇని ప్రశ్నించిన ఎంపీ

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధులు మంజూరు చేస్తే పనులు ఎందుకు చేపట్టడం లేదని విద్యుత్ శాఖ ఎస్ఇ దైవప్రసాద్‌ను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. నగరంలోని సర్కిల్ కార్యాలయంలో ఎస్ఇని బుధవారం కలిసి విద్యుత్ శాఖ పరిధిలో చేపడుతున్న పనుల్లో నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. మంత్రి అప్పలరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న పలాస నియోజకవర్గం పరిధిలోనే ఈ సమస్య ఎందుకు ఉత్పన్నమవుతోందని నిలదీశారు. మందస మండలం భేతాళపురంలో విద్యుత్ లైన్ కోసం నిధులు మంజూరు చేశామని, అక్కడ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సత్వరమే పనులు చేపట్టాలని కోరారు. స్థానికంగా ఉన్న అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు చీకట్లోనే మగ్గాల్సి వస్తోందన్నారు. తరచూ విద్యుత్ లైన్లు మరమ్మతులకు గురవుతున్నాయని చెప్పారు. ఇటువంటి సమయంలో ప్రజల అభ్యర్థన మేరకు నిధులు ఇస్తే సకాలంలో పనులు ఎందుకు చేయలేకపోతున్నారని ఎస్ఇని ప్రశ్నించారు. విద్యుత్ లైన్లకు సరిపడా సామగ్రి అందుబాటులో ఉన్నా ఉద్దేశపూర్వకంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. తక్షణమే పనులు ప్రారంభించి ప్రజలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో విద్యుత్ శాఖ డిఇఇ, ఎడిలతో పాటు టిడిపి నాయకులు మెండ దాసునాయుడు, పలాస నియోజకవర్గానికి చెందిన పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

### 31 లోగా కళాశాలల గుర్తింపునకు దరఖాస్తులు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ 89 ప్రయివేటు కళాశాలలు మాత్రమే ఆన్‌లైన్‌లో గుర్తింపునకు దరఖాస్తు చేసుకున్నాయని ఆర్ఐఒ ఎస్.తవిటినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోని కళాశాలలు ఈనెల 31వ తేదీ లోగా రూ.పది వేల అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కళాశాలను నిర్వహించుకునేందుకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. https://bieaffiliation.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# వెల్లివిరిసిన సాంస్కృతిక శోభ

- యువజనోత్సవాల్లో ఆటపాటలు
- దేశ, విదేశాల్లో జిల్లా కళాకారులకు ప్రశంసలు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**




కళలకు పుట్టినిల్లుగా చెప్పుకునే జిల్లాలో కోవిడ్ కారణంగా రెండేళ్లు కళా ప్రదర్శనలకు అంతరాయం ఏర్పడినా, ఈ ఏడాది సాంస్కృతిక శోభ వెల్లివిరిసింది. నగరంలోని కళావేదికలన్నీ నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనంద డోలికల్లో జిల్లా ప్రజలను ఓలలాడించింది. జిల్లాలోని నృత్య దర్శకులు నీరజా సుబ్రహ్మణ్యం, రఘుపాత్రుని శ్రీకాంత్, శివ, మంది దివ్య తదితర కళాకారులు తమ శిష్యులతో నృత్య ప్రదర్శనలు ఇస్తూ ఉత్సాహాన్ని నింపుతూ ఉత్తేజాన్ని కలిగించారు.

నూతన సంవత్సర వేడుకలతో ప్రారంభమైన కొత్త సంవత్సరం తొలినాళ్లలో శ్రీసుమిత్ర కళా సమితి ఆద్వర్యాన జనవరి 6న రాజమండ్రికి చెందిన అవధాన చింతామణి తాతా సత్య సందీప్ శర్మ సంపూర్ణ శతావధానంతో సాంస్కృతిక సందడి మొదలైంది. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు విరామం లేకుండా సాగింది. సంక్రాంతి సంబరాలు జరుపుకోలేక పోయినా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన యువజనోత్సవాలు అదే నెలలో జరిగాయి. కర్రసాము, కత్తి సాము, తప్పెటగుళ్ల వంటి స్థానిక కళాకారులతో సాంస్కృతిక వేడుకలను నిర్వహించారు. నగర వాసులకు ఈ వేడుకలు వినోదాన్ని పంచాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనల వివిధ పాఠశాలల విద్యార్థులతో పాటు స్థానిక కళాకారులకు వేదికగా నిలిచాయి. ఈ వేడుకల్లో నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. దీనికి తోడు దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర పరేడ్‌లో ప్రదర్శనలు ఇచ్చేందుకు శ్రీకాంత్ బృందానికి అవకాశం దక్కింది. వారణాసిలో నిర్వహించిన ఆజాదికా అమృత్ మహోత్సవాల్లో శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి శిక్షణాలయం నృత్య కళాకారులు తమ ప్రదర్శనలు నిర్వహించారు. జాతీయ స్థాయిలో శ్రీకాకుళం కీర్తి ప్రతిష్టలను పెంచారు.

#### ఫోక్‌తోనూ కనువిందు

సంప్రదాయ నృత్యాలకు తోడు ఫోక్ డాన్సుల ప్రదర్శనకు ఈ ఏడాది అవకాశం దక్కింది. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో జోష్ శివ డాన్స్ అకాడమీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మెగా డాన్స్ షో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యువత ఫోక్ డాన్సులతో అలరించారు. సినీ నటుడు చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని డాన్సు పోటీలు నిర్వహించారు. చిరంజీవి నటించిన సినిమాల్లోని పాటలకు యువత స్టెప్పులు వేసి అలరించారు.



#### గణతంత్ర వేడుకల్లో అవకాశం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వందే భారతం నృత్యోత్సవ్ గణతంత్ర దినోత్సవ వేడుకల పెరేడ్ పోటీలకు మెహెర్ నృత్య కళానికేతన్ విద్యార్థులు ఎంపికయ్యారు. వచ్చే ఏడాది జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో వీరు ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ పెరేడ్‌కు జిల్లా నుంచి ప్రదర్శనకు ఎంపికైన రెండో బృందం ఇది. గతంలో ఈ అవకాశం శ్రీకాంత్ బృందానికి దక్కింది.

#### అరసవల్లి వేదికగా కళాబృందాల ప్రదర్శనలు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏడాది పొడవునా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కోలాటం, బృంద నృత్యాలు, కథాకళి, కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ, భోజ్‌పురి సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.

### అంతర్జాతీయ వేదికపై సిక్కోలు ప్రతిభ

అమెరికాలోని పలు రాష్ట్రాల్లో 17వ ఆటా మహాసభల సంర్భంగా తొమ్మిది రోజుల పాటు శ్రీకాంత్ శిష్య బృందం కూచిపూడి, భరతనాట్యం, కథాకళి వంటి భారతీయ సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇచ్చి అంతర్జాతీయ వేదికలపై జిల్లా ఖ్యాతిని నిలిపారు. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో మూడు ప్రదర్శనలు ఇవ్వడం జిల్లా కళాకారులకు ఇదే ప్రథమం. అమెరికాలో భారత రాయబారి తరంజిత్ సింగ్ సందు, క్రికెటర్ కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్, క్రిస్ గేల్, గ్రంధి మల్లికార్జునరావు వంటి ప్రముఖులతో కలసి ఈ బృందం అమెరికాలో పర్యటించే అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. వర్జీనియా నగరంలోని ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అంతర్జాతీయ ఫోరం ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయస్థాయి కూచిపూడి విభాగం (8-12 సంవత్సరాలు) పోటీల్లో కొమ్ము చేతనప్రియ ప్రథమ స్థానం దక్కించుకుంది.



స్వేచ్ఛా నృత్య తరంగిణి శిక్షణాలయం కళాకారులు

పద్మభూషణ్ పద్మా సుబ్రమణ్యం చేతుల మీదుగా 'వేద విజ్ఞాన్ మహా విద్యా పీఠ్ ఈ బహుమతిని అందజేశారు. ఏడాది ప్రారంభంలో సంపూర్ణ శతావధానంతో ప్రారంభమైన సాంస్కృతిక వేడుకలను శ్రీసుమిత్ర కళాసమితి ఏడాది చివరల్లో లలితాదిత్య మయూఖం సంపూర్ణ శతావధానం కార్యక్రమాన్ని నిర్వహించింది.

## సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షునిగా శంకర్

**ప్రజాశక్తి - శ్రీకాకుళం**




పంచాయతీ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షునిగా కిష్టప్పేట సర్పంచ్ గొండు శంకరరావు నియమితులయ్యారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన సంఘ రాష్ట్ర సమావేశంలో సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ వై.బి రాజేంద్రప్రసాద్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా జిల్లాలోని సర్పంచ్‌లు అందరినీ కలుపుకొని హక్కుల కోసం, నిర్వీర్యం అవుతున్న పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టత కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. చట్టబద్ధంగా పంచాయతీలకు రావాల్సిన నిధులు, విధుల కోసం పనిచేస్తానని చెప్పారు. మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్య సాధన కోసం, అధికార వికేంద్రీకరణ, స్థానిక స్వపరిపాలన, స్వయం పోషకత్వాలను సాధించేందుకు సర్పంచ్‌లు అందరినీ ఏకతాటిపై నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు సహకరించాలని సర్పంచ్‌లను కోరారు.

# పింఛన్లపై ఆందోళన వద్దు

### జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్

**ప్రజాశక్తి - కవిటి**

అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛను అందుతుందని జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ స్పష్టం చేశారు. పింఛను పోతుందనే ఆందోళన చెందవద్దన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 3,11,140 పింఛన్లు పంపిణీ చేస్తుండగా, ఈ ఏడాది కొత్తగా 9,346 మంజూరయ్యాయని తెలిపారు. ఆరు నెలలకోసారి నిర్వహించే ఆడిట్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా 5,994 పింఛన్లపై అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. ఈనెల 29వ తేదీ లోగా వాటిని సరిచేసి పంపిస్తే, ఎప్పటి మాదిరిగానే పింఛను అందుతుందన్నారు. ఇన్‌కమ్ టాక్స్, 300 యూనిట్ల కరెంటు బిల్లు దాటిన వారికి, పల్లం మూడెకరాలు, పదెకరాల మెట్టు భూమి ఉన్న వారికి, పట్టణాల్లో వెయ్యి ఎస్ఎఫ్‌టి స్థలం ఉన్న వారి పింఛన్లకు అభ్యంతరం వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే వీటిలో సగం పింఛన్ల అభ్యంతరాలను సరిచేసి పంపించామని, మిగతా వాటిని ఈ రెండు రోజుల్లో సరిచేసి పంపించేస్తామన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 912 గ్రామ పంచాయతీల్లో 605 చెత్త సంపద తయారీ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. మిగతా పంచాయతీల్లో బేస్‌మెంట్ స్థాయిలో 146, పిల్లర్ స్థాయిలో 100, రూఫ్ స్థాయిలో 49, ప్రారంభం కానివి 12 ఉన్నాయని వివరించారు. వీటిపై ప్రతి వారం ఎంపిడిఒలు సమీక్షించి, ఉన్న దశ నుంచి ప్రగతి చూపించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒలు పి.సూర్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్



మందుల నిల్వలను పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

## అందుబాటులో ప్రభుత్వ వైద్యం

### శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

**ప్రజాశక్తి - ఆమదాలవలస**

ప్రభుత్వ వైద్యం పేదోడికి అందుబాటులో ఉండాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని దూసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తొగరాం, అక్కులపేట, దూసి ప్రాథమిక ఆస్పత్రుల అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఆస్పత్రుల్లో ఒపి సంఖ్య, రోగులకు అందుతున్న సేవలు తదితర వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మందులు తదితర వివరాల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రభుత్వానికి రెండు కళ్లు వంటివన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం అధిక నిధులు వెచ్చించి పేదలకు బాసటగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సిబ్బంది పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనురాధ, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, వైద్యులు బాలచందర్, మెట్ట స్రవంతి, మీనా కుమారి, సర్పంచ్ ప్రతినిధి చిగురుపల్లి దశరథ, సర్పంచ్ కనుగుల కిషోర్, వైసిపి నాయకులు గురుగుబెల్లి నీలారావు, పొన్నాడ రాము, బెండి జయరాం తదితరులు పాల్గొన్నారు.

## 10న జెడ్‌పి బడ్జెట్ సమావేశాలు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం**

జిల్లాపరిషత్ బడ్జెట్ సమావేశాలు జనవరి పదో తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

## క్రీడలతో మానసిక ఉల్లాసం
### శాసనసభ స్పీకర్ సీతారాం

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇందువతమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన క్రికెట్ క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆముదాలవలస క్రీడలకు పుట్టినిల్లు వంటిదని అన్నారు. పలు క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ కీర్తి ప్రతిష్టలను తీసుకువచ్చిన ఘనత నియోజకవర్గపు క్రీడాకారులదేనని అన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడంతో మరింత స్ఫూర్తి కలుగుతుందని అన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామన్నారు. ఆముదాలవలసలో మరిన్ని పోటీలు నిర్వహించేందుకు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, సనపల మోహన్ సురేష్, కూన రామకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

## భవన నిర్మాణ పనులు వేగవంతం

**కొత్తూరు :** రూ.2.5 కోట్లతో నిర్మిస్తున్న నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. జనవరి నాటికి పనులు పూర్తి చేసి భవనాన్ని అందజేయాలని ఆదేశించారు. ఈమె వెంట టెక్కలి డిఎస్‌పి శివరామిరెడ్డి, పాతపట్నం ఇన్‌ఛార్జి సిఐ ఎం.వినోద్‌బాబు, ఎస్‌ఐ గోవిందు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

## దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు

**టెక్కలి రూరల్ :** దళారుల ప్రమేయం లేకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చివరి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులు ఈ-క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలని అన్నారు. ధాన్యం ఇచ్చిన 21 రోజుల్లోనే నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. జెసి నవీన్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఫిబ్రవరి వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, ఏ రైతు దిగులు చెందాల్సిన అవసరం లేదని అన్నారు. పంట ఎంత నమోదు చేస్తారో వాటికి తగ్గట్టు డబ్బులు రైతు ఖాతాలో జమవుతాయని, మిల్లర్స్‌తో పనిలేదని అన్నారు. సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, తహశీల్దార్ బి.కుమార్, తహశీల్దార్‌లు, ఎఒలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

**ప్రజాశక్తి - రణస్థలం**

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండములగాం మోడల్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన 95 ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మరింత మెరుగ్గా చదువుకునేందుకు ట్యాబ్‌లు ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైసిపి మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, వైస్ ఎంపిపిలు రాయపురెడ్డి బుజ్జి, మైలపల్లి కామరాజు, ఎంఇఒ త్రినాథరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ టేకి బ్రహ్మాజీ, ఎంపిటిసి రెడ్డి వాసు పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి:** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలన్న ఉద్దేశంతో సిఎం ట్యాబ్‌లు అందిస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక జెడ్‌పి బాలుర పాఠశాలలో ఎంఇఒ సిహెచ్ గోవిందరావు ఆధ్వర్యంలో మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 850 మంది 8వతరగతి విద్యార్థులకు దువ్వాడ ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని రాష్ట్రానికి, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, మౌలిక సదుపాయాలు, మంచి ఉపాధ్యాయులు ఇక్కడ ఉన్నారని చెప్పారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల అవరణలో దువ్వాడ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజారామకృష్ణ, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, నాయకులు నూక సత్యరాజు, బమ్మిడి గణపతిస్వామి, నేతింటి అప్పలస్వామి, పాఠశాల హెచ్‌ఎంలు ఎల్.వి.ప్రతాప్, మెట్ట వేణు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


రణస్థలం : ట్యాబ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


కోటబొమ్మాళి : విద్యార్థినులతో ఎమ్మెల్సీ శ్రీనివాస్

**పలాస:** స్థానిక జ్యోతిరావు పూలే పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు 39 మందికి ప్రిన్సిపాల్ విద్యాసాగర్, కాశీబుగ్గ సాయి కాలనీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నందిగాం:** మండలంలోని తురుకొలకోట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు మాజీ ఎంపిపి యర్ర చక్రవర్తి, వైస్ ఎంపిపి సువ్వారి వసంతకుమర్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్త అగ్రహారం సర్పంచ్ కె.శేషగిరి, కర్లపూడి సర్పంచ్ రాజు, వైకుంఠరావు, రమణబాబు, హెచ్‌ఎం ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.

**కవిటి:** మండలంలోని సహలాలపుట్టుగ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, బడ్డాయి మురళి, దట్టి అజయ్, కొర్రాయి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**సోంపేట:** పలాసపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ జోగారావు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి రమణమూర్తి, గ్రామ పెద్దలు బి.కృష్ణారావు, బి.వెంకటరమణ, పి.కృష్ణారావు, డి.మోహన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

**కంచిలి:** మండలంలోని జలంత్రకోట, గోకర్ణపురం, బూరగాం ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, ఎంఇఒ శివరాం ప్రసాద్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఆర్‌కె పండా, చిట్టిబాబు, బివి.రమణ, సర్పంచ్ ఆనందరావు, కృష్ణారావు, హెచ్‌ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు. గోకర్ణపురం పాఠశాలలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

**లావేరు :** మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ కొల్లి ఎల్లమ్మ, ఎంపిటిసి కాగితాల కృష్ణారెడ్డిలు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి. వసంతలక్ష్మి, ఉపాధ్యాయులు బి.సుచిత్ర, ఎస్.రాము, బి.విజయకుమారి, బోర రాజారావు పాల్గొన్నారు.

# దుబాయ్‌కు 'అగ్రి' విద్యార్థుల పయనం

**శ్రీకాకుళం అర్బన్ :** దుబాయ్‌లోని ఐసి బిఎలో ఇంటర్న్‌షిప్‌కు నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు భయలు దేరారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఐడిపి నెహప్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాంలో భాగంగా దుబాయిలో రెండు నెలలు పాటు (జనవరి 1, 2023 నుంచి ఫిబ్రవరి 28 వరకు) ఇంటర్న్‌షిప్ కొనసాగుతుంది. ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎన్.సాయిచైతన్య, వి.సౌమ్యలు ఈ ప్రోగ్రాంకు ఎంపికైనట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ వెల్లడించారు. వీరితోపాటు జనవరి నెలలో మరో పది మంది విద్యార్థులు థాయిలాండ్ దేశానికి, మరో నలుగురు అమెరికాకు, మరో ముగ్గురు మలేషియా, ఫిన్లాండ్ దేశానికి ఒకరు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న డీన్ శ్రీనివాస్

వ్యవసాయ సంబంధిత అంశాలపై అధ్యయనంతో పాటు మెలుకువలు నేర్చుకొని, నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు స్వదేశానికి విశ్వవిద్యాలయ ప్రతిష్ట, కీర్తిని పెంచాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎ.ఉపేంద్రరావు, డాక్టర్ ఎన్.సునంద, డాక్టర్ ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.

## 'డిస్క్రీట్ మేథమెటిక్స్' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు, తదితరులు

**టెక్కలి రూరల్ :** ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ శాంతికుమార్ రచించిన 'డిస్ట్ మేథమెటిక్స్' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ రంగంలో అత్యధిక ప్రాధాన్యత సంతరించుకున్న కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్, బిగ్ డేటా ఎనాలసిస్, సైబర్ సెక్యూరిటీస్, డేటా సైన్స్‌తో పాటు పలు నూతన పరిశోధనలు చేసే విద్యార్థులకు, అధ్యాపకులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ శాంతికుమార్‌ను అధ్యాప, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ పుస్తకావిష్కరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆరెన్డీ డాక్టర్ కె.బి.మధుసాహు, డీన్ ఆరెన్డీ డాక్టర్ డి.ఆజాద్, డీన్ ఫిన్సింగ్ స్కూల్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, పుస్తక రచయిత డాక్టర్ ఆర్.శాంతికుమార్, అసోసియేట్ డీన్లు డాక్టర్ ఎం.జయమన్మథరావు, డి.యుగంధర్, జి.వాసంతీ, ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక

**నరసన్నపేట:** స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో దివిస్, అరబిందో ఫార్మా అధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 32 మంది ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. వీరికి రెండు నెలలు పాటు శిక్షణ అందించి అయా కంపెనీలలో నియమిస్తారని అన్నారు. ఈ మేళాకు మొత్తం 76 మంది హాజరయ్యారని తెలిపారు. తమ కళాశాలలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న బైరాగినాయుడు

## విద్యతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం

**పోలాకి:** విద్యార్థులకు మంచి విద్య అందించడంతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని మండల ప్రత్యేక సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు అన్నారు. బుధవారం మండలంలోని గంగివలస కెజిబివి బాలికల వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు విద్యార్థులతో కలిసి భోజనం చేసి, విద్యార్థులకు, వారి యొక్క భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు భోజన వసతి ఉందని సంతోషం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, గంగివలస సర్పంచ్ బంకా చక్రధర్, వైసిపి నాయకులు త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.


గోవిందరావు మృతదేహం

## వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి- బూర్జ**

మండలంలోని అన్నంపేటలో కుటుంబ కలహాలు కారణంగా వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... అన్నంపేటకు చెందిన మజ్జి గోవిందరావు (50) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మంగళవారం భార్యాభర్తలు ఘర్షణ పడ్డాడు. దీంతో గోవిందరావు మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగి అపస్మారకస్థితిలోకి చేరుకున్నారు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందారు. మృతుడికి భార్య ఉష, కుమార్తెలు మౌనిక, ఝాన్సీ, కుమారుడు ఉమామహేశ్వరరావు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళపై దాడి

**ప్రజాశక్తి- ఆమదాలవలస**


పరిశీలిస్తున్న ఎఎస్ఐ లక్ష్మి

రెండు రోజులుగా మండలంలోని కలివరం ప్రాంతంలో ఓ మహిళ తిరిగింది. దీనిని గమనించి గ్రామస్తులు పిల్లలను ఎత్తుకుపోయేందుకు వచ్చిందని అంటూ ప్రచారం మొదలు పెట్టారు. ఇంతలో ఆమె చేతిలో చిన్నపాటి కత్తి, ద్రావకం లాంటిది కనిపించాయని బుధవారం ఓ విద్యార్థి చెప్పడంతో యువత ఒక్కసారిగా పరుగులు పెట్టి చెట్టుకు కట్టేసి కాలు, చేతులు విరిగేలా చితక్కొట్టారు. కొంత మంది వచ్చి రాని హిందీ భాషతో ప్రశ్నించడంతో బీహార్ అని చెప్పింది. పిల్లలను కిడ్నాప్ చేసి ఎక్కడకి తీసుకుపోతావని ప్రశ్నించిన వారికి ఆమె దో బేటా బీహార్ అంటూ హిందీలో బిత్తర బిత్తరగా చూస్తూ చెప్పింది. ఇద్దరు పిల్లలను బీహార్ పంపించేసిందని, మరికొంత మంది ముఠా ఉన్నారని అంటూ యువకులు రెచ్చిపోయి విచక్షణా రహితంగా కొట్టారు. సమాచారం అందుకున్న ఎఎస్ఐ లక్ష్మి తన సిబ్బంది కలివరం చేరుకుని ఆరా తీశారు. అనంతరం ఆమెను విడిచిపెట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అపరిచితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని, ఎవరూ కొట్టరాదని పోలీసులు సూచించారు.


తహశీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

## రైతుల ఆందోళన


**కొత్తూరు :** మండలంలోని ఒండ్రుజోలకు చెందిన రైతులు బుధవారం ఆందోళన చెందారు. గ్రామానికి చెందిన చనపతి సత్యం, రామారావు, దాలి నాయుడులు తమ ధాన్యం లోడును మురళిపేట సిరిడీ సాయి మిల్లుకు తరలించారు. మిల్లు యజమాని కూన అర్జున్ బస్తాకు 2,3 కేజీలు ధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ పి.బాలకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న తహశీల్దార్ మిల్లు వద్దకు చేరుకుని యజమాని మాట్లాడి ధాన్యం వేసుకోవాలని సూచించి వెళ్లిపోయారు. అయినా యథావిధిగా మిల్లు యజమాని ధాన్యం డిమాండ్ చేస్తున్నారని రైతులు వాపోయారు.


ఆర్థికసాయం అందిస్తున్న లోళ్ల రాజేష్

## క్షతగాత్రునికి సాయం

**ప్రజాశక్తి- కవిటి**

మండలంలోని బి.గొనపపుట్టుగ గ్రామానికి చెందిన క్షతగాత్రుడు ఎం.మోహనరావుకి జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ అండగా నిలిచారు. మోహనరావు ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో తన రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని ఆయన కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న రాజేష్ బుధవారం గ్రామానికి చేరుకుని మోహనరావుకి నెలకు సరిపడే నిత్యావసర సరుకులు, రూ.2 వేలు అందజేశారు. అంతేకాకుండా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన జాయింట్ సెక్రటరీ బైపిల్లి ఈశ్వరరావు, పండి పథ్వీ, జన సైనికులు పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న ఆదిరెడ్డి

## బీమా అందజేత

**ఇచ్ఛాపురం:** మున్సిపాలిటీలోని కెపి.కాలనీలో ఇటీవల మృతిచెందిన చెవిటి పాపారావు కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను వార్డు కౌన్సిలరు ఆదిరెడ్డి పంపిణీ చేశారు. మృతుని భార్య మహాలక్ష్మికి పై మొత్తంను అందించారు. మిగతా రూ.90వేలు నామిని బ్యాంకు ఖాతాలో జమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ద్విచక్ర వాహనాల వేలం

**సోంపేట:** ఎస్ఇబి కార్యాలయం వద్ద గురువారం ఉదయం 15 ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఇబి అధికారి వెంకటప్పలనాయుడు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.వెయ్యి ధరావతు చెల్లించి, తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

# విజేతలకు అభినందనలు

**ప్రజాశక్తి- పలాస**

ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో ఎస్ఆర్‌జెడ్‌పిహై స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రయోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కబరిచిన విద్యార్థులను మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్ స్కూల్ యాజమాన్యం బుధవారం అభినందనలు తెలిపారు. గత వారం రాయవరంలో నిర్వహించిన యోగా పోటీల్లో 13 పూర్వ జిల్లాలకు చెందిన 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నుంచి అండర్-14 విభాగంలో మొదటి స్థానంలో సంపతిరావు ఆశిష్, ద్వితీయ స్థానంలో ఈ.చరణ్, తృతీయ స్థానంలో జి.దీక్షిత్, టి.జానకిరామ్ నిలిచారు. వీరు రాష్ట్ర పోటీల్లో కూడా టాప్ 8 నుంచి 15లో నిలిచారని కోచ్ కిరణ్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన నలుగురు విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర పరిశీలకులు టి.పూర్ణచందర్, యోగా రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ బి.శంకరరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మళ్ల రామేశ్వర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, మేనేజర్ అనుదీప్, బలవికాస్ ఉపాధ్యాయులు మాధవి పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

# కొత్త వ్యవస్థల ఏర్పాటు ఘనత జగన్‌దే


మాట్లాడుతున్న సాయిరాజ్

**ప్రజాశక్తి- సోంపేట**

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేనని వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. సోంపేటలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో బుధవారం నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గ్రామ వాలంటీర్లు, సిబ్బందితో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను 100శాతం నెరవేర్చిన ఘనత సిఎందేనని అన్నారు. సచివాలయ కన్వీనర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటారన్నారు. కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లతో సమన్వయంగా పనిచేస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, జెడ్‌పిటిసి తడక యశోద, ఎంపిపి నిమ్మన దాసు, నాయకులు మద్దు రాజారావు, తడక జోగారావు, బి.శ్రీకృష్ణ, తిరుపతిరావు, శ్రీను, పి.కామేష్, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

## గౌతు శివాజీ పరామర్శ

**ప్రజాశక్తి- పలాస**

మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి నాయుడులను మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ పరామర్శించారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. అనంతరం కిష్టుపురం గ్రామానికి చెందిన నిమ్మాన బాబురావు తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని పరామర్శించారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఏ అవసరం ఉన్నా తనను సంప్రదించాలని కోరారు. శివాజీ వెంట పి.విఠల్‌రావు, దువ్వాడ శ్రీహర్ష, రుద్రయ్య, దువ్వాడ సంతోష్‌కుమార్, టిడిపి సీనియర్ నాయకులు బి.కృష్ణంరాజు, చిట్టి, రవి, ప్రసాద్, సింహాచలం, యాదగిరి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.


నాగావళి, కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న శివాజీ


# 22న వ్యాసరచన పోటీలు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

భారత జాతీయ కళలు సంస్కృతి వారసత్వ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యాన నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్‌లో విద్యార్థులకు వైవిధ్య వారసత్వ వంటకాలు ప్రధాన అంశంగా ఖానా ఖజానా పేరుతో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు ఇంటాక్ జిల్లా కన్వీనర్ నూక సన్యాసిరావు తెలిపారు. ఈ మేరకు నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో బుధవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో 7,8,9 తరగతుల విద్యార్థులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిత్రలేఖనం పోటీలకు రెండున్నర గంటలు, వ్యాసరచన పోటీలకు అరగంట కేటాయించినట్టు వివరించారు. ప్రతి పాఠశాల నుంచి పది మంది విద్యార్థులను మాత్రమే అనుమతించామని అన్నారు. విద్యార్థుల పేర్లను ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణతో జనవరి 6లోగా న్యూ సెంట్రల్ స్కూల్‌లో అందజేయాలని సూచించారు. విజేతల ఎంపికకు, ఎంట్రీలు ఇంటాక్ న్యూఢిల్లీ కార్యాలయానికి పంపిస్తామని, ప్రాంతీయంగా వంద మందిని విజేతలుగా ప్రకటించి జాతీయస్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. మరిన్ని వివరాలకు 9441085895, 9493085703 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. పోటీలకు అవసరమైన సామగ్రిని అభ్యర్థులే తెచ్చుకోవాలన్నారు. డ్రాయింగ్ షీటు, తెల్ల కాగితాలను ఇంటాక్ సమకూరుస్తుందని తెలిపారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు అర్హులన్నారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, వావిలపల్లి జగన్నాథం నాయుడు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సన్యాసిరావు

# దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి- పొందూరు**

పొందూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి ఇంటిపై దాడికి పాల్పడిన గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు విప్పర్తి ప్రసాద్ కోరారు. సర్పంచ్ రేగిడి లక్ష్మీతో పాటు కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మిని కులం పేరుతో దూషించడంతో పాటు ఇంటిపై రాళ్లతో దాడికి పాల్పడి నాలుగు రోజులు అవుతున్నా ఇప్పటికీ పోలీసులు స్పందించకపోవడమేమిటని ప్రశ్నించారు. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే డిజిపి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సంఘటనను సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టాలని కోరారు. ఈయనతో పాటు దళిత సేన రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ షేక్ షఫీబా, ఉపాధ్యక్షులు వై.గంగరాజు, జనరల్ సెక్రటరీ సునీల్ ఉన్నారు.


క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ, శ్రీధర్

## క్యాలండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి- పలాస**

సేవా కార్యక్రమాలు చేపట్టడం, అన్నదానం నిర్వహించడం ఎంతో మహోన్నతమైనదని, అటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అందరి వల్ల సాధ్యం కాదని ప్రముఖ వైద్యులు టి.బాలకృష్ణ అన్నారు. దీన్ని నిర్వహిస్తున్న మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ సేవలు వెలకట్టలేమని అన్నారు. దువ్వాడ శ్రీధర్ ఇంటి వద్ద శిరిడీ సాయి-2023 క్యాలండర్‌ను బుధవారం ఆలయ ధర్మకర్త దువ్వాడ శ్రీధర్, దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రతి రోజూ పేదలకు, నిరాశ్రయులకు అన్నదానం చేసిన గొప్ప వ్యక్తి దువ్వాడ శ్రీధర్ అని కొనియాడారు. అనంతరం డాక్టర్ బాలకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దువ్వాడ అన్నాజీరావు, మల్లా కామేశ్వరావు, మల్లా భాస్కరరావు, కూన హేమాచాలం, నవీన్, టి.శ్రీనివాస్, కంచరాన జగన్, కొంచాడ మన్మథ, పెంట విష్ణు, బెల్లాల నారాయణరావు, రాజారావు, కాళీ, ప్రదీప్ పండా, కింతలి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**శ్రీకాకుళం అర్బన్ :** బ్రిటిష్ వారి పరిపాలన నుంచి విముక్తి కోసం దేశంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని, ఎందరో త్యాగధనులు పార్టీ, దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన చరిత్ర ఉందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జెండాను ఎగురవేశారు. ముందుగా ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రజల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. మతతత్వ శక్తుల చేతికి పాలనా పగ్గాలు అప్పగించిన తర్వాత దేశంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తూ లబ్ధిపొందుతున్నారని అన్నారు. దేశ సమగ్రత లౌకిక వాదాన్ని కాపాడే శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, డి.గోవిందు, మల్లిబాబు, అంబటి కృష్ణారావు, రెల్ల సురేష్, బస్వా షణ్ముఖరావు, మంత్రి నరసింహమూర్తి, భైరి రాజేశ్వరరావు, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, అంబటి దాలినాయుడు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న సత్యవతి


మాట్లాడుతున్న సిఐ సతీష్‌కుమార్

## శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం సర్కిల్ పరిధిలో ఉన్న ఇచ్ఛాపురం అర్బన్, రూరల్, కవిటి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సిఐ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఏడాది జరిగిన నేరాలపై సమీక్షించారు. సర్కిల్ పరిధిలో మొత్తం 383 కేసులపై ఎఫ్ఐఆర్ కట్టినట్లు చెప్పారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో 128, రూరల్‌లో 147, కవిటి పోలీస్ స్టేషన్‌లో 108 కేసులు నమోదైనట్లు చెప్పారు. సర్కిల్‌లో నేరాలకు సంబంధించి 14 కేసులు నమోదు చేయగా, ఇందులో 12 కేసులు పరిష్కరించి రూ.8.72 లక్షలు రికవరీ చేశామని తెలిపారు. నాలుగు గంజాయి కేసుల్లో 19 మందిని అరెస్టు చేశామని, 16 కేజీల గంజాయి పట్టుకున్నట్లు చెప్పారు. 38 అక్రమ ఇసుక రవాణా కేసుల్లో 45 మందిని అదుపులోకి తీసుకున్నామని, 34 ట్రాక్టర్లు, మూడు లారీలు సీజ్ చేసినట్లు తెలిపారు. తొమ్మిది గాంబ్లింగ్ కేసుల్లో 48 మందిని అరెస్టు చేసి రూ.1.11 లక్షలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఎంవిఐ కేసులు 6679 నమోదు చేసి రూ.12.84 లక్షలు జరిమానా విధించామని చెప్పారు. 28 ఎక్సైజ్ కేసుల్లో 39 మందిని అరెస్టు చేసి 1900 మద్యం సీసాలు, 21 వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. 16 నాటు సారా కేసుల్లో 20 మందిని అరెస్టు చేసి 890 లీటర్ల సారా సీజ్ చేశామని అన్నారు. రహదారి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. 31 అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకల్లో విచ్చల విడిగా మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో పలువురు పేదలకు అభయం సేవా సంఘం 25 కేజీల బియ్యంతో పాటు, నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేసింది. మండలంలోని గోపినాథపురంలో పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధుడు బుర్రు లోకనాథానికి, ఆసరాలేని ఒంటరి మహిళ పోలాకి మాధవికి, మండపోలం కాలనీకి చెందిన నిరుపేద నెయ్యిల ధనలక్ష్మికి, వృద్ధుడు నెయ్యిల కుపేలునికి, బొప్పాయిపురంలో రోడ్డుప్రమాదంలో గాయపడిన సాన బాలకృష్ణ కుటుంబానికి, నీలాపురంలో వృద్ధ దంపతులు బొడ్డు లచ్చయ్య, వసేలమ్మకు, తిర్లంగిలో వృద్ధురాలు పొందర సావిత్రమ్మకు నెల రోజులకు సరిపడ 25 కేజీల బియ్యం, 20 రకాల నిత్యావసర సరుకులు అందజేసినట్లు ఆ సంఘం అధ్యక్షులు డి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో అభయం సేవాసంఘం సభ్యులు శ్రీనివాస్ బెహోరా, ఎన్. సింహాచలం, మున్నా, జగదీష్ పొరిడ, అద్దాల వీరభద్రాచారి, డి.శ్రీను, బి.మల్లేష్, లాడి సుకన్య, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# యథేచ్ఛగా కంకర తవ్వకాలు!


చిట్టివలస కొండను తవ్వేసిన అక్రమార్కులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

అక్రమార్కుల కన్ను పడితే ఎంతటి కొండైనా కరిగిపోవాల్సిందే. దానికి ఉదాహరణ మండలంలోని గాజులకొల్లివలస, చిట్టివలస పరిధిలోని సంగమేశ్వర కొండ దగ్గర ఉన్న ఎర్ర కొండ. ఇక్కడ నుంచి రాత్రిపూట యథేచ్ఛగా కంకరను తవ్వుకుపోతున్నారు. స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇష్టానుసారం గ్రావెల్‌ను తవ్వుకుపోతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని గాజుల కొల్లివలస, చిట్టివలస, దివంజిపేట, అలాగే పురపాలక సంఘ పరిధిలోని జగ్గుశాస్త్రులపేట, తిమ్మాపురం తదితర ప్రాంతాల్లోని సర్వే నంబరు 183లో 50 ఎకరాల్లో ఎర్ర కొండ విస్తరించి ఉంది. ఇటు పట్టణం, అటు మండలానికి ఈ కొండ దగ్గర్లో ఉండటంతో అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రిపూట గ్రావెల్‌ను తవ్వేసుకుపోతున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మండలంలో, పట్టణంలో ప్రభుత్వ, ప్రయివేటు అభివృద్ధి పనులు చేపడుతుండడంతో గ్రావెల్‌కు అధిక డిమాండ్ పలుకుతుంది. దీంతో అక్రమార్కులు కొండలను తవ్వేస్తూ రెండు చేతుల సంపాదిస్తున్నారు. ఒక ట్రాక్టర్ లోడ్‌కు రూ.3 నుంచి రూ.4 వేల వరకు కాంట్రాక్టర్లు వినియోగదారుల నుంచి వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక నాయకులు, అధికారులు, రాత్రిపూట గస్తీ కాసే పోలీసు సిబ్బంది సహాయ సహకారాలతో అక్రమార్కులు తమ పని ఎంచక్కా చక్కబెట్టుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పచ్చగా కనపడాల్సిన కొండలు అక్రమార్కుల చేతిలో చిక్కిపోవడంతో కనుమరుగై కొండలు బక్క చిక్కి శల్యం అయిపోతున్నాయని పర్యావరణ ప్రేమికులు అక్రమార్కుల ఆధీనంలో తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించి అక్రమార్కుల భరతం పట్టాలని పలువురు కోరుతున్నారు.


సగానికి పైగా తవ్వేసిన సంగమేశ్వర కొండ


మొక్కలను నాటుతున్న సభ్యులు

## మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. మహదేవిపురం గ్రామానికి చెందిన కూరగాయల రైతు అంబల చినబాబు ఇటీవల మృతిచెందారు. బుధవారం ఆయన పెద్దకర్మ సందర్భంగా పొలంలో గ్రీన్ ఆర్మీ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఇష్టమైన వ్యక్తులు మరణిస్తే వారి గుర్తుగా మొక్కలు నాటి కొత్త సంప్రదాయం నెలకొల్పారన్నారు. మరణించిన వ్యక్తికి ఈ విధంగా నివాళులర్పించడం పర్యావరణ హితాన్ని తెలుపుతుందన్నారు. ఎదుగుతున్న మొక్కలు చూడగానే మరణించిన వ్యక్తి మనతోనే ఉన్నారనే అనుభూతి కలుగుతుందని చెప్పారు. మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి తమ్మినాన శాంతారావు, కౌన్సిలర్ సనపల సింహాచలం, ఉపాధ్యాయులు నగిరి లక్ష్మి, బత్తిన ఓంకార్, బి.దుర్యోధన, గ్రీన్ ఆర్మీ సభ్యులు నీలాపు లక్ష్మీనారాయణరెడ్డి, టి.శంకరరావు, బి.తిరుమలరావు, కోన జనార్ధన్, తమ్మినాన కృపారావు పాల్గొన్నారు.

**మెళియాపుట్టి :** ఉపాధి హామీ పథకంలో భాగంగా ఎవెన్యూ, హార్టికల్చర్ ద్వారా నాటిన మొక్కల స్థానంలో కొత్తవి నాటి, సంరక్షించుకోవాలని ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణరెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జనవరి నాటికి మండలంలో 2500 మంది కూలీలకు రోజువారి పనిచేసే విధంగా చూడాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆధార్ కంప్లెయింట్స్ ఉంటే క్షేత్ర సహాయకులను సంప్రదించాలన్నారు. పని కోరిన ప్రతి ఒక్కరూ పనిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో టిసి, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇచ్ఛాపురంలో వైసిపి గెలుపే లక్ష్యం

### వాలంటీర్లు, కన్వీనర్ల సమావేశంలో నాయకుల అత్యుత్సాహం

ప్రజాశక్తి- కవిటి

నాలుగు దశాబ్దాలుగా ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలు టిడిపికి అండగా ఉంటున్నారనే ఆక్రోశం, ఇన్ని పథకాలు ఇస్తున్నా గ్రామస్థాయిలో ఇంకా మూడు నుంచి నాలుగు శాతం ప్రజలకు వైసిపి గుర్తు కూడా తెలియడం లేదనే ఆవేదన కవిటి మండలంలో బుధవారం నిర్వహించిన వైసిపి కన్వీనర్లు, వాలంటీర్ల సమావేశంలో ప్రస్ఫుటించింది. కొత్తగా నియమించిన కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి వాలంటీర్లు ఏం చేయాలి, ఎలా చేయాలి అనే విషయంపై సమావేశంలో చెప్పడం మరిచిపోయి ప్రతిపక్షాలకు ఖర్చుకాంద నిర్వహించాలి, ప్రతిపక్షాలను తుడిచిపెట్టాలంటూ సమావేశం చేసిన ఆవేశ ప్రసంగాలు నియోజకవర్గ పరిస్థితిని ప్రతిబింబించాయి. ఒకవేళ ఎన్నికల సమయంలో వాలంటీర్ల సేవలపై ప్రతిపక్షాలు కోర్టుకు వెళ్తే, వారికి బదులుగా కన్వీనర్లు, గృహ సారథులు బాధ్యతలు నిర్వహిస్తారని నాయకులు చెప్పడం విశేషం. చివరికి వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కాళి మాట్లాడుతూ ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా వైసిపి నాయకుడిని గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వాలని చెప్పడం చర్చనీయాంశం అయ్యింది. సిఎఫ్ఎంఎస్ నుంచి నెలనెలా జీతం తీసుకుంటూ ఒక రాజకీయ సమావేశంలో, ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న వ్యక్తి నిర్భయంగా మాట్లాడటం పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ సమావేశంలో మాట్లాడిన మండల నాయకులందరి నోట ఇచ్ఛాపురం గెలుపే మాట అయింది. ఒక్కో సందర్భంలో అంతర్గతంగా నియోజకవర్గంలో గెలుపుపై వారిలో ఉన్న భయాలు వారి ప్రసంగంలో బయలుపడ్డాయి. సీడాప్ చైర్మన్ ఎస్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్ళినప్పుడు గ్రామాల్లో కొంతమందికి వైసిపి గుర్తు కూడా తెలియడం లేదని, అడుగుతుంటే తడబడుతున్నారని అన్నారు. నియోజకవర్గస్థాయిలో ఇది మూడు నుంచి నాలుగు శాతం ఉంటుందని అన్నారు. అంటే సుమారు 7వేలపై చిలుకు ఓటర్లు మన గుర్తు తెలియడం లేదని, ఎన్నికల్లో అది ఖచ్చితంగా ప్రభావం చూపించే అవకాశం ఉందని అన్నారు. పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ వాలంటీర్లు, గృహసారథులు సమన్వయం చేసుకుని వారికి సంబంధించిన సచివాలయం పరిధిలో అందరికీ ప్రభుత్వ పథకాల గురించి తెలియజేసి, ప్రభుత్వ విధి విధానాలు తెలియజేయాలని సూచించారు. రాబోయే కాలమంతా ఎన్నికల కాలమని, కన్వీనర్లు, గృహ సారథులతో వాలంటీర్లు సమన్వయం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్ర గోపయ్య, పిఎసిఎస్ చైర్మన్ దేవరాజ్ సాహు, ఎఎంసి చైర్మన్ దువ్వు కష్టారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, కో ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, వాలంటీర్లు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాయిరాజ్


ఉద్యోగాలకు ఎంపికైన ఆదిత్య కళాశాల విద్యార్థులు

## 'జెమోసో'కు 11 మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ పూర్తి చేయనున్న పలు బ్రాంచ్‌లకు చెందిన 11 మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన జెమోసో ల్యాబ్స్ అనే కంపెనీకి ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో వారు ఎంపికైనట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాదికి రూ.6.5లక్షల వేతనంతో వీరంతా విధులు నిర్వహిస్తారన్నారు. జెమోసో ల్యాబ్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఫిన్సింగ్ స్కూల్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.వి.ఎన్.ఎస్ సంతోష్ కుమార్ అభినందించారు.

# గడప గడపకూ సంక్షేమ ఫలాలు

### శాసనసభ స్పీకర్ సీతారాం

**బూర్జ:** ముఖ్యమంత్రిగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన వారికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని అన్నారు. సాంకేతిక పరమైన సంక్షేమ పథకాలు అందకపోతే, గ్రామ సచివాలయం ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, సర్పంచ్ ఎగు అనురాధ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

# సర్పంచ్‌లకు రూ.15 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి

**పలాస:** పంచాయతీ సర్పంచులకు ప్రభుత్వం ఇస్తున్న రూ.3 వేలును రూ.15వేలకు పెంచాలని గుంటూరు ఉమ్మడి జిల్లాల సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు చిలకపూడి పాపారావు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బొడ్డపాడు సర్పంచ్ తామడ మధన్ అధ్యక్షతన పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల సర్పంచులతో బుధవారం విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే పంచాయతీ ఖాతాలో జమచేయాలని, గిరిజన ప్రాంతాల్లో ఉన్న పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ కార్డు జీతాలను కేంద్ర ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని కోరారు. సచివాలయం వ్యవస్థ వచ్చిన తర్వాత సర్పంచ్‌లకు గౌరవం లేకుండా పోయిందని, వాలంటీర్లకు సర్పంచ్ నుంచే జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, లేని పక్షంలో చలో అసెంబ్లీ, చలో ఢిల్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు. జనవరి 5వ తేదీన తాడేపల్లి సిఎస్ఆర్ కళ్యాణ మండపంలో సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం సమావేశం నిర్వహిస్తున్నామని, అందరూ కదలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం నాయకులు టి.కృష్ణమోహన్, షేక్ అల్లాబక్ష, ఆరుదల సాంబశివరావు, అఖిలభారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ )కార్యదర్శి జాస్తీ వీరాంజనేయులు, ఉదయ్‌కుమార్, సర్పంచులు అప్పారావు, తామడ మధన్, శాసనపురి తిరుమలరావు, సురేష్, రామారావు, చంద్రశేఖర్, కరుణాకర్, విద్యాసాగర్ గోపాల్, చింత హేమారావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు


మాట్లాడుతున్న ఎపిడి మురళీకృష్ణ

## ప్రత్యామ్నాయ పనులపై దృష్టి

**కోటబొమ్మాళి:** మండలంలోని 38 పంచాయతీల్లో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా ప్రత్యామ్నాయ పనులపై దృష్టి సారించాలని ఎపిడి బి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం ఆయన స్థానిక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం సమావేశం మందిరంలో సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ప్రస్తుతం చెరువులో నీరు నిల్వ ఉండటంతో పనులు చేసేందుకు అంతరాయం కలగడం వల్ల రైతులకు ఉపయోగపడే ప్రత్యామ్నాయ పనులపై దృష్టి సారించాలని సూచించారు. కూలీలకు రూ.257లు వచ్చేలా 6గంటల పాటు పనులు నిర్వహించి, సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. సమావేశంలో ఎపిఒ జి.హరిప్రసాద్, ఇసి టి.రాంబాబు, పి.నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# పోస్టుల బ్లాక్‌తో విద్యా ప్రమాణాలు పతనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

'ప్రీ హైస్కూళ్ల'లో పెద్దఎత్తున స్కూల్ అసిస్టెంటు పోస్టులు బ్లాక్ చేస్తుండటంతో విద్యా ప్రమాణాలు పతనం అవుతాయని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్‌మోహన్, బల్ల సుభాష్‌బాబు ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ బదిలీలు, రీ అపోషన్‌మెంట్ సందర్భంగా జిల్లా విద్యాశాఖ విడుదల చేస్తున్న ఖాళీ జాబితాలు పరిశీలిస్తే బ్లాకింగ్ అర్థమవుతోందన్నారు. వివిధ మండలాల్లో ప్రీ హైస్కూల్స్ ప్రధాన సబ్జెక్టులైన గణితం, ఆంగ్లం స్కూల్ అసిస్టెంట్ పోస్టులు బ్లాక్ చేశారని ఆరోపించారు. 3,4,5 తరగతులకూ సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తామని చెప్తూ వచ్చిన ప్రభుత్వం ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరించడం సరికాదన్నారు. సబ్జెక్టు టీచర్లు లేకపోతే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలల వైపు చూసే ప్రమాదం ఉందన్నారు. ఉన్నత పాఠశాలలకు సబ్జెక్టు టీచర్లను తగిన సంఖ్యలో కేటాయించడం మంచిదే అయినా, ప్రీ హైస్కూళ్లపై అశ్రద్ధ చూపుతూ బ్లాక్ చేయడం తగదన్నారు. డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టుఉ భర్తీ చేసే వరకు ప్రీ హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల స్థానంతో కనీసం అగినెస్ట్ ఎస్‌జిటి పోస్టులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

# నాడు-నేడు పనుల పరిశీలన


నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ప్రకాశరావు

**పలాస :** పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను జిల్లా వత్తి విద్యాశాఖాధికారి కె.ప్రకాశరావు బుధవారం పరిశీలించారు. పనులు ఎంత వరకు చేపట్టారు, ఇప్పటివరకు ఎంత బిల్లు చెల్లించడం జరిగింది, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ బాడ వెంకట మోహన్, లైబ్రరీ సైన్స్ అధ్యాపకుడు పి.చిరంజీవులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చిరంజీవి నాగ్

## టిడిపిది అనవసర రాద్ధాంతం

**ఆమదాలవలస :** ప్రభుత్వం పించన్లను తొలగిస్తుందని టిడిపి నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తుందని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వెంకట చిరంజీవి నాగ్ అన్నారు. స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అర్హత లేకపోయినా పింఛన్లు పొందుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. వారికి మాత్రమే నోటీసులను జారీ చేశారని అన్నారు. అర్హత లేని వారి వల్ల నిజమైన లబ్ధిదారులు పింఛన్లకు దూరమయ్యారని అన్నారు. నోటీసులు అందుకున్న వారికి తాత్కాలికంగా పింఛన్ల మంజూరును నిలుపుదల చేసినట్లు తెలిపారు. సమావేశంలో వైసిపి పట్టణ పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, దుంపల శ్యామలరావు, పొందూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్ పాల్గొన్నారు.

## పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**జి.సిగడాం :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక గ్రామ సచివాలయంలో కన్వీనర్లు, వాలంటీర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్ర మంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, బాతువ పిఎసిఎస్ చైర్మన్ పల్లాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

## అరసవల్లి సందర్శన

**శ్రీకాకుళం అర్బన్ :** అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని బుధవారం ప్రముఖులు సందర్శించారు. స్టేట్ ఆడిట్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పి.సీతారామారావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మిలు వారివారి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించిన పలు సేవల్లో హాజరైన అనంతరం అనివేటి మండపంలో శేషవస్త్రాలను, చిత్రపటాలను ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. కార్యక్ర మంలో శ్రీకాకుళం ఆడిట్ డిఎఒ సిహెచ్.ప్రభావతి, టూరిజం రీజినల్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, ఆలయ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ హరిసూర్యప్రకాష్

## పొష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని క్షయవ్యాధి గ్రస్థులకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన పౌష్టికాహారం కిట్లను అందజేశారు. రెడ్‌క్రాస్ భవనంలో నగర ట్రాఫిక్ డిఎస్‌పి జి.వి.వి.ప్రసాదరావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగులు క్రమం తప్పకుండా ఆరు నెలల వరకు మందులు తప్పనిసరిగా వాడాలని సూచించారు. భారత ప్రభుత్వ మినిస్టర్ ఫర్ హెల్త్ అండ్ ఫ్యామిలి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జాతీయశాఖ సూచనల మేరకు దాతల సహకారంతో పౌష్టికాహార కిట్లు అందజేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావు, సభ్యులు కె.సత్యనారాయణ, బి.చిన్మయరావు, బి.శ్రీధర్ పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న ప్రసాదరావు

## పింఛన్లు కొనసాగుతాయి

**లావేరు :** అర్హులందరికీ పింఛన్లు యథావిధిగా కొనసాగుతాయని ఎంపిడిఒ వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియచేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా పింఛన్లు తొలగిస్తున్నారని వస్తున్న పుకార్లను ఎవ్వరూ నమ్మవద్దని కోరారు. జనవరి నెల నుంచి రూ.2,750 పింఛను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. ఇప్పటికీ వస్తున్న 57 మంది పింఛనుదారులకు మరిన్ని వివరాలు కావాలని నోటీసులు జారీ చేశామన్నారు. అయితే వీటిపై పింఛనుదారులు ఎవరూ ఆందోళనకు గురికావద్దని సూచించారు. ఇవి కేవలం పరిశీలనకే మాత్రమే నోటీసులు అందజేశామన్నారు. సచివాలయ సిబ్బందికి ధ్రువపత్రాలను అందజేయాలని సూచించారు.

## చెత్త సంపద కేంద్రానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కోటిపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి అనువైన స్థలాన్ని ఎంపిడిఒ సీపాన హరిహరరావు బుధవారం పరిశీలించారు. ఇటీవల చెరువులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంతో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పనులను నిలిపివేశారు. అనంతరం గ్రామంలో వేరు ప్రదేశంలో అనువైన స్థలాన్ని నిర్మాణం చేపట్టేందుకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈయనతో పాటు సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి అసిరినాయుడు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

## పంటలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఆహార, అహారేతర పంటలు, వాణిజ్య పంటలు, చిరుధాన్యాలు, హార్టీ కల్చర్‌పై విద్యార్థులకు కురుడు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.ఖగేశ్వరరావు బుధవారం అవగాహన కల్పించారు. 8వ తరగతి సాంఘిక శాస్త్రం నుండి వ్యవసాయం-భారతదేశం అన్న పాఠంపై విషయ అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో క్షేత్ర పర్యటన చేశారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కరిమి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పంటలపై అవగాహన కల్పించారు. ఎరువులు, పురుగు మందులు వాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనం పోటీల్లో 'అశోక' విద్యార్థుల ప్రతిభ

**ఆమదాలవలస :** జిల్లాకు చెందిన చిత్రకారుడు వడ్డాది పాపయ్య శతజయంతి సందర్భంగా శ్రీకాకుళం పట్టణానికి చెందిన చైతన్య కళాశాలలో ఇటీవల జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఆమదాలవలస పట్టణానికి చెందిన అశోక పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు లాస్య, సాయి చరిష్మా, సుస్మిత, మౌనిక ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ వి.టి.చౌదరి తెలిపారు.

# ప్రతి పాఠశాలనూ ఎఎన్‌ఎంలు సందర్శించాలి


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న సురేష్‌కుమార్

**జలుమూరు:** ఎల్‌సిడిసి సర్వేలో భాగంగా ప్రతి పాఠశాలనూ ఎఎన్‌ఎంలు సందర్శించి, చర్మ సంబంధిత పరీక్షలు నిర్వహించాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని యామలపేట మండల ప్రాథమిక పాఠశాలలో ఎల్‌సిడిసి స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌సిడిసి సర్వేలో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 75 కొత్త లెప్రసీ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఈ నెల చివరి నాటికి జిల్లా వ్యాప్తంగా ఎల్‌సిడిసి సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జగదీశ్వరి, హెల్త్ అసిస్టెంట్ వెంకటరావు పాల్గొన్నారు.

# పంచసూత్రాలు పాటించాలి

### ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతంలో మహిళలతో ఏర్పాటు చేసిన గ్రామ సంఘాలు, స్వయంశక్తి సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పంచసూత్రాలు పాటిస్తూ ఎ గ్రేడ్‌లోనికి వచ్చేటట్లు కృషి చేయాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సంఘం అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతి సంఘమూ క్రమం తప్పకుండా షెడ్యూలు ప్రకారం సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందరి సమక్షంలో లావాదేవీలు, పొదుపులు, అప్పులు కట్టుకోవడం, పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. బ్యాంకుకు అప్పుకు వెళ్లేముందు సంఘం సమావేశం నిర్వహించి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు రేణుక, వేణమ్మ, అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు